

బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

కరీంనగర్ టౌన్, మార్చి 27: పిల్లలు బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆయన నగరంలోని బాలసదన్, శిశుగృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పరిశుభ్రంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఆహారపదార్థాలను నిలువచేసే గదిని తనిఖీ చేశారు. ఆహారపదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బాలసదన్, శిశు గృహాల్లోని పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేశ్, బాల సదన్ నిర్వాహకురాలు సంతోషి, శిశుగృహ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికులు ఆధునిక ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి

- చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు శరత్

హుజూరాబాద్, మార్చి 27: మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత కార్మికులు ఆధునిక ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు శరత్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలో చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి సంఘం వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు వస్త్రాలు నాణ్యతగా తయారు చేస్తేనే మార్కెట్లో డిమాండ్ ఉంటుందన్నారు. ప్రతి కార్మికుడు కష్టపడి పని చేసినప్పుడే ఆ సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీలను అందజేస్తామన్నారు. సమావేశంలో ఉపేందర్, శ్రీకాంత్‌రెడ్డి, అనిత, వేముల యాదగిరి, మహాదేవ్, ప్రభాకర్, సత్యనారాయణ, వెంకటయ్య, సుమలత, వాణి, తిరుపతి, లింగమ్మ పాల్గొన్నారు.

భూ కబ్జాలపై కొరడా

- దూకుడు పెంచుతున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్
- ఒకే రోజు 3 ఫిర్యాదులతో 13 మందిపై క్రిమినల్ కేసులు

కరీంనగర్ క్రైం, మార్చి 27: భూ కబ్జాలపై కమిషనరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్(ఇఓడబ్ల్యు) అక్రమార్కులపై కొరడా ఝులిపిస్తున్నది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంకు సీసీఎస్ ఏసీపీ వి మాధవి నాయకత్వం వహిస్తుండగా సీపీ అభిషేక్ మొహంతి మానిటరింగ్ చేస్తున్నాడు. భూకబ్జాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు సంబంధించి సీపీకి ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. 20 రోజులుగా ఎలాంటి కేసులు, అరెస్టులు లేకపోవడం, లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉన్నందున అరెస్టులు నిలిచిపోతాయని ప్రచారం జరిగింది. అనూహ్యంగా మంగళవారం ఒకే రోజు మూడు వేర్వేరు ఫిర్యాదులపై 13 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులతోపాటు ఒక రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. అరెస్టు అయిన వారిలో ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన కొత్తపల్లి జడ్పీటీసీ భర్త, చింతకుంట మాజీ సర్పంచ్ పిట్టల రవీందర్, కాంగ్రెస్ నాయకుడు మంద నగేష్ ముదిరాజ్, కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్, రౌడీషీటర్ విష్ణువర్ధన్ ఉన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్, ఇప్పటికే భూకబ్జా కేసులో అరెస్టు అయి నెల రోజులుగా జైలులో ఉన్న మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్యతో సహా ఎనిమిది మందిని త్వరలోనే అరెస్టు చూపించనున్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా భూకబ్జాలు, దౌర్జన్యాలు, మోసాలకు సంబంధించి ఇప్పటి వరకు 1,750 వరకు ఫిర్యాదులు అందాయి. వీటిలో 70 నుంచి 80 శాతం వర కు భూకబ్జాలు, మోసాలకు సంబం ధించినవే ఉన్నాయి.

● ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ

లోక్ సభ ఎన్నికలు, కోడ్ ఉన్నందున ఇక నుంచి సోమవారం మాత్రమే ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు సీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి సోమవారం సీపీ తన కార్యాలయంలో అందుబాటులో ఉంటూ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారు. ఒకే పార్టీకి చెందిన నాయకులను అరెస్టు చేస్తున్నారనే విమర్శలు కూడా వచ్చాయి. ఇటీవల ఒక తహసీల్దార్ అరెస్టు విషయంలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దమనిషి ఫోన్ చేసి జోక్యం చేసుకోబోగా చట్టం అందరికీ సమానమేనని సీపీ సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. తాజాగా కాంగ్రెస్ నాయకులను కూడా అరెస్టు చేయటం గమనార్హం.

● 78 మందిపై 36 కేసులు

భూకబ్జాలు, దౌర్జన్యాలు, ఆర్థికనేరాలకు సంబంధించినవి ఇప్పటి వరకు 78 మందిపై 36 కేసులు నమోదుకాగా, 34 మంది అరెస్టు అయి జైలుపాలయ్యారు. ఇందులో కార్పొరేటర్లు, కార్పొరేటర్ల భర్తలు, జడ్పీటీసీ భర్త, మాజీ ఎంపీటీసీ, మాజీ ఆర్టీఏ మెంబరు, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, తహసీల్దార్, వీఆర్ఏ, రౌడీషీటర్, రాజకీయపార్టీల నాయకులు, ఇతరులు ఉన్నారు. ఇంకా కొందరు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు నోటీసులు జారీ చేసి విచారించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఇప్పటికే ఇద్దరు తహసీల్దార్లపై కేసులు నమోదుకాగా ఒకరిని అరెస్టు కూడా చేశారు. మరికొందరు మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ల శాఖల ఉద్యోగులతోపాటు మరి కొందరు ప్రజాప్రతినిధులపై కూడా కేసులు నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఎన్నాళ్లీ ఎదురు చూపులు

- గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా అందని వేతనాలు
- నిధులు లేక ఇబ్బందులు

"గ్రామ పంచాయతీ కార్మికులు ఎండనకా.. వాననకా పని చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతారు. వీరు తక్కువ వేతనానికి పని చేస్తూ గ్రామస్థులకు ఏ పనిలోనైనా చేదోడువాదోడుగా ఉంటారు. అటువంటి కార్మికులు నాలుగు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలోనే వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబపోషణ కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వేతనాలు వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు.



చిగురుమామిడి మండలం ఉల్లంపల్లిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికురాలు



గన్నేరువరం గ్రామపంచాయితీ కార్యాలయం

గన్నేరువరం, మార్చి 27: జిల్లాలోని చాలా వరకు గ్రామ పంచాయతీల్లో కార్మికుల వేతనాలు నిలిచిపోయాయి.. నిత్యం గ్రామాల్లో డ్రైనేజీ, వాటర్ సప్లై, వీధి దీపాల నిర్వహణ వంటి విధులను నిర్వహిస్తున్న జీపీ కార్మికులకు సక్రమంగా వేతనాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయితీకి విడుదల అయ్యే నిధుల్లో ఎక్కువ శాతం కరెంట్ బిల్లులకు, ట్రాక్టర్ ఈఎంఐకే పోతున్నాయి. ఏమైనా నిధులు మిగిలితే సిబ్బందికి జీతాలు ఇస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిశాక ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వీరికి డిజిటల్ కీ ఇవ్వడంలో జాప్యం జరిగింది. దీంతో మూడు నుంచి నాలుగు నెలలుగా వేతనాలు గ్రామ పంచాయతీ కార్మికులకు అందలేదు.

- **తిమ్మాపూర్:** మండలంలోని 23గ్రామ పంచాయితీల్లో 98 మంది కార్మికులు, సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి గరిష్టంగా ప్రస్తుతం నెలకు 9500రూపాయలు వేతనం అందిస్తున్నారు. 500 జనాభాకు ఒక కార్మికుడి చొప్పున పంచాయితీల్లో నియమించుకొనే విధంగా ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. వాటి ప్రకారం ఆయ గ్రామాల్లో ఉన్న జనాభా ప్రాతిపదికన పంచాయతీల్లో సిబ్బందిని నియమిస్తారు. గ్రామ పంచాయితీలకు జనాభా అధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తాయి. వాటితో పాటు గ్రామ పంచాయితీల్లో ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్లు, భూమి శిస్తు, ఇతర పన్నులు కూడా వస్తాయి. ప్రభుత్వం నుంచే కాకుండా ఈ గ్రామంలో వసూలు అయ్యే పన్నులు కూడా సకాలంలో రావడం లేదు. దీంతో మండల వ్యాప్తంగా చూస్తే వచ్చునూర్, జుగుండ్లతో పాటు ఇతర చిన్న గ్రామ పంచాయితీలలో సుమారు ఆరు నెలలకు పైగా పంచాయితీ సిబ్బందికి నెల నెల జీతాలు అందడం లేదు. పెద్ద గ్రామ పంచాయితీల్లోనూ దాదాపు 3 నెలలుగా సిబ్బందికి జీతాలు రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని పంచాయితీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- **మానకొండూర్:** మండలంలో 27 గ్రామపంచాయితీలుండగా ఇందులో 186 మంది జీపి కార్మికులు పని చేస్తున్నారు. గ్రామాలలోని మురికి కాల్వలు, రోడ్డును శుభ్రం చేయడమే కాకుండా సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు దుర్వాసను భరిస్తు తరలిస్తుంటారు. శ్రమకు తగ్గ ఫలితం లేకపోవడమే కాకుండా చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- **చొప్పదండి:** మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు .మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా -- మంది కార్మికులు పని చేస్తున్నారు. దాదాపు ప్రతి గ్రామ పంచాయతిలోని కార్మికులకు రెండు నుంచి నాలుగు నెలల వేతనాలు పెడింగ్‌లో ఉన్నాయి. చిట్యాలపల్లిలో కార్మికులకు ఐదు నెలల జీతాలు, దేశాయిపేటలో నాలుగు, కొలిమికుంటలో నెల, కుర్మపల్లిలో నాలుగు, మంగళపల్లిలో రెండు, రాగంపేటలో నెల, సాంబయ్యపల్లిలో మూడు, కొనేరుపల్లిలో నాలుగు నెలల జీతాలు కార్మికులకు రావల్సి ఉంది.



రామడుగులో ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు (ఫైల్)

- **గంగాధర:** మండలంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదు. మండలంలో 33 గ్రామ పంచాయతీలున్నాయి. గతంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు డిజిటల్ కీ ఉండేది. చిన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలనలో కూడా జీతాలు ఇవ్వలేదు. సర్పంచులే తమ సొంత డబ్బులు కార్మికులకు చెల్లించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సరిపోక పోవడం, స్థానికంగా పన్నులు వసూలు గాక సిబ్బంది జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులకు ఇప్పటికీ డిజిటల్ కీ ఇవ్వకపోవడంతో కార్మికులకు జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారు.
- **చిగురుమామిడి:** మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 92 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరందరూ మూడు నెలలుగా జీతాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గునుకులపల్లి గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. ఎండనకా, వాననకా కష్టపడి పని చేస్తున్నా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- **రామడుగు:** మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 180 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. గత ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో మండలవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేపట్టారు. అయినా ఫలితం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటిన వేతనాలు చెల్లించలేదు. దీంతో కుటుంబపోషణ కష్టమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తిమ్మాపూర్‌లో చెత్తను ఎత్తుతున్న పంచాయితీ సిబ్బంది(ఫైల్)



మానకొండూర్‌లో చెత్తను సేకరిస్తున్న జీపీ కార్మికులు

వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బబారిన పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేసవికాలం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చి న్నారులు, గర్భిణులు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి కూలీలు, కార్మికు లు ఉదయం పూటనే పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశా వర్క ర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాఠశాలలతోపాటు ఉపాధి కూలీలకు, గ్రామాల్లో ఓఆర్ ఎస్ ప్యాకె ట్లు పంపిణీ చేయాలన్నారు. తాగునీటి ని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టండి

ఎండల తీవ్రత అధికమవుతున్నందున తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు సంబంధించి 210 అత్యవసర పనులు చేపట్టేందుకు వివిధ గ్రాంట్ల కింద 5.08 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామాల్లో బోర్లు, పంపుసెట్లు మిగతా అత్యవసర మరమ్మతులు చేపట్టాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతిరోజు గ్రామాలను సందర్శించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, డీపీవో రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, మిషన్ భగీరథ ఈఈ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

● పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ ఈఈ, ఏఈలు, డీఈలతో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిధులు ఉన్నా నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయక పోవడం ఏమిటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● మీడియా సెంటర్ ప్రారంభం

కరీంనగర్ టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగరంలోని కలెక్టరేట్ జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మాని టరింగ్ సెల్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప మేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు మీడియా సెంటర్‌నుఏర్పాటు చేశామన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	6:27	గురువారం
సహర్	4:45	శుక్రవారం



తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి 27: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పుట్ట ధర్మయ్య(38) అనే పశువుల కాపరి తేనెటీగల దాడిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన పుట్ట ధర్మయ్య బుధవారం పశువులను మేపుకుంటూ గ్రామ శివారులోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా మెట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ధర్మయ్య మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాలీ ఆటోను అపహరించిన వ్యక్తిని పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో ఓ ట్రాలీ ఆటోను అపహరించి అనుమానాస్పదంగా కనిపించిన గుర్తు తెలియని వ్యక్తిని బుధవారం రాత్రి స్థానికులు పట్టుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సిరిసిల్ల గోపాల్‌నగర్ ప్రాంతంలో నిలిపి ఉంచిన బండారి లక్ష్మణ్‌కు చెందిన ట్రాలీ ఆటోను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. తన వాహనం కనిపించకపోవడంతో ఆందోళన చెందిన వాహన యజమాని లక్ష్మణ్ చుట్టు పక్క గ్రామాల ఆటో డ్రైవర్లకు సమాచారం అందించాడు. వెంకటాపూర్ గ్రామ శివారులో అనుమానస్పదంగా ట్రాలీ ఆటోతో ఓ వ్యక్తి కనిపించాడు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో స్థానికులు అతన్ని తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 27: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ఒక వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష, ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిం దని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 18 మందిని కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఆరుగురికి జైలు శిక్షమొత్తం10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 12 మందికి 18,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

● ఈవో కృష్ణప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ, మార్చి27: రాజరాజేశ్వర క్షేత్రంలో శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం నిర్వహించనున్న శ్రీస్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి దివ్యకల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివస్తున్న విషయం దృష్టిలో ఉంచుకుని విశాలమైన వేదికను ఏర్పాటు చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వీలుగా భారీ స్క్రీన్లు అమర్చామన్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా క్యూలైన్లు క్రమబద్ధీకరించామని అన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు కోడెమొక్కులు మినహా అన్ని రకాల ఆర్జిత సేవలు నిలిపివేశామని అన్నారు.

రాజన్నక్షేత్రంలో వైభవంగా శివకళ్యాణోత్సవాలు

● స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ● నేడు పార్వతీరాజరాజేశ్వరస్వామివారి కళ్యాణం



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ధర్మగుండంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి27: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివకల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు ఉదయం 8-05 గంటలకు శివ భగవత్పుణ్యాహవచనము గావించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారి కళ్యాణ మంటపంలో ఆచార్య దంపతులు దంపతులకు, అర్చకస్వాములకు, వేదపండితులకు ఆలయ ఈఓ కృష్ణప్రసాద్ వరుణి అందజేశారు. అనంతరం అర్చకులు పంచగవ్య మిశ్రణము, దీక్షాధారణము, మంటప ప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠ, గౌరీ షోడశ మాతృకా ప్రతిష్ఠ, మృత్సంగ్రహణము, అంకురార్పణము, వాస్తు ప్రతిష్ఠ, సోమకుంభ కలశ ప్రతిష్ఠ, వాస్తుహోమము, కుండ సంస్కారం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు ఉదయం మహామండపంలో శ్రీరాజరాజేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించగా, వేదపండితులు వేదపారాయణం గావించి, పరివార దేవతార్చనలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీస్వామివారి కల్యాణమంటపంలో శివపురాణ ప్రవచణం చేవారు. రాత్రి భేరీ పూజ, దేవతాహ్వనము నిర్వహించారు. శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి దివ్యకల్యాణోత్సవం 28వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. కల్యాణానికి వేములవాడ దివ్యక్షేత్రం అందంగా ముస్తాబైంది. ఆలయ చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉ. 10-50 గంటల నుంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారల దివ్యకల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం శివ పురాణ ప్రవచనం, ప్రధాన హోమము, సప్తపది నిర్వహిస్తారు. శివకళ్యాణోత్సవానికి భక్తులు, శివపార్వతులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ మేరకు భక్తులు శ్రీస్వామివారి కల్యాణం వీక్షించడానికి ఆలయ ప్రాంగణంలో స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. శివకల్యాణోత్సవాల సందర్భంగా కోడెమొక్కుతో పాటు ఐదు రోజుల పాటు అభిషేకం, అన్నపూజ తదితర అన్నిరకాల ఆర్జిత సేవలను నిలిపివేశారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

రాజరాజేశ్వర క్షేత్రంలో శివకల్యాణోత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అంజయ్య పరిశీలించారు. ఎద్ద సంఖ్యలో భక్తులు, శివపార్వతులు తరలివస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

దొంగల అరెస్టు

● నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మార్చి 27: జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు వ్యక్తులతో పాటు ఒక మైనర్ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా బుధవారం కరీంనగర్ రూరల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ రవిందర్‌లు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ కృష్ణలంకకు చెందిన బొజ్జ మనోజ్ కుమార్ కొంత కాలంగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో నివాసం ఉంటూ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులైన హైదరాబాద్ బోయినిపల్లికి చెందిన బందెల సుమిత్, విజయవాడకు చెందిన ఎల్ల సత్య ఆంజనేయులుతో పాటు బాలుడు జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోనందున ఒక ముఠాగా ఏర్పడి బైక్‌లు దొంగిలిస్తున్నారు. నలుగురు కలిసి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో నాలుగు బైక్‌లను చోరీ చేశారు. యమహా(టీఎస్ 22 హెచ్ 6478), పల్సర్(టీఎస్ 02 ఈఆర్ 7196), పల్సర్(టీఎస్ 25 ఎఫ్ 7024), (టీఎస్ 04 ఇజి 3006)లను ఈ ముఠా చోరీ చేసింది. ఈ బైక్‌లలో ఒకటి హైదరాబాద్‌కు తరలించిన నిందితులు మిగతా మూడు బైక్‌లను కూడా తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నలుగురు నిందితులపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, ఎల్ఎండీ ఠాణాలలో కేసులు నమోదు చేశారు.

భర్త చేతిలో భార్య హతం

● నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

పెద్దపల్లిటౌన్/ఎండపల్లి మార్చి 27: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన రజిత(35) భర్త చేతిలో మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురైంది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తన కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన యాళ్ల పున్నంరెడ్డికి అదే మండంలం నర్సింగాపూర్‌కు చెందిన రజితతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. పున్నంరెడ్డి చెడు అలవాట్లకు బానిసై తరుచూ భార్యతో గొడవపడేవాడు. ఈ విషయమై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. మద్యం మానేసి కొనాళ్ల సజావుగా ఉన్న పున్నంరెడ్డి రెండు నెలల క్రితం నుంచి మళ్లీ తాగుడు మొదలు పెట్టాడు. దీంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఇదే క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన భర్తను మళ్లీ ఎందుకు తాగుతున్నావని భార్య ప్రశ్నించింది. మద్యం మత్తులో ఉన్న పున్నంరెడ్డి కోపోద్రికుడై రజితను చేతికందిన ఇనుప వస్తువుతో తలపై బలంగా బాదడంతో రజిత అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు రజిత తల్లి వజ్రవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ మొదలుపెట్టారు. నిందితుడు పున్నంరెడ్డిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పెద్దపల్లి సీఐ రాసూరి క్రిష్ణ, బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

జగిత్యాలలో ఒకరి ఆత్మహత్యాయత్నం

జగిత్యాల టౌన్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో బుధవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములుగు జిల్లా నూజివీడు గ్రామానికి చెందిన మణికుమార్ సతీమణి జగిత్యాలలోని చిల్డ్రన్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. కొన్ని రోజులుగా వారికి కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. బుధవారం జగిత్యాలకు చేరుకున్న మణికుమార్ తన భార్యతో గొడవకు దిగాడు. తీవ్ర మనస్థాపానికి గురైన మణికుమార్ చేతిలో పురుగుల మందు డబ్బాను పట్టుకుని స్థానిక గొల్లపల్లి రోడ్‌లో కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొంటూ డయల్ 100కు సమాచారం అందించాడు. తక్షణమే స్పందించిన బ్లూ కోల్ట్స్ పోలీస్ జుబేర్ సంఘటనా స్థలానికి చేరుకుని పురుగుల మందు డబ్బాను లాక్కుని రక్షించాడు. అనంతరం చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ములుగు జిల్లాలోని వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

ఘనంగా లక్ష్మీనృసింహుని ఉత్తర దిగ్యాత్ర



లక్ష్మీ నృసింహ స్వామి వారల ఊరేగింపు సేవ



ఉసిరిక వాగు సమీపంలో లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

- ఉసిరిక వాగు వద్ద పూజలు అందుకున్న నారసింహుడు

ధర్మపురి, మార్చి 27: ధర్మపురి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో సేవలపై ఆశీనులు చేశారు. పుర వీధుల గుండా ఉత్తర దిగ్యాత్ర కోసం ఉసిరిక వాగు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద స్వామివారల సేవలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. దారిపొడవుగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రాత్రి వేళలో స్వామి వారల సేవలు తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణయ్య ఆధ్వర్యంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, నవీన్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు రాపర్తి సాయికిరణ్, మాదాసు మల్లేష్, నేదునూర్ శ్రీధర్, కొమిరెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్ దంపతులు, ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌శర్మ, తిరుపతి, రమేష్, మామిడివాడ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరికి జైలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: పికప్ వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వాహన డ్రైవర్ ఆలకుంట రాజు, యాజమాని ఆలకుంట శేఖర్‌లను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 15 రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఏఎస్ఐ కిషన్‌రావు బుధవారం తెలిపారు. ఈ నెల 26న స్టేషన్ హౌజ్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని కానిస్టేబుళ్లు సతీష్, మహేందర్, శ్రీకాంత్‌లు అక్కపల్లి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో వీరు ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. విచారణ జరిపి గతంలోనూ ఇద్దరిపై కేసులు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సిరిసిల్ల కోర్టులో హాజరు పర్చామని పేర్కొన్నారు. న్యాయమూర్తి ఆలకుంట రాజు, ఆలకుంట శేఖర్‌లకు 15 రోజుల జైలు విధించారని ఏఎస్ఐ కిషన్‌రావు వివరించారు.

ఇంటర్ బీసీ విద్యార్థుల ఫీజు ప్రభుత్వం భరించాలి

గణేశ్‌నగర్, మార్చి27: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ చదివే బీసీ విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం నిర్ణయించి రీయింబర్స్ రూపంలో విద్యార్థులకు అందజేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసు పెద్ది శ్రీధర్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజులు అందజేస్తామని ప్రకటించిందన్నారు.

కేబుల్ బ్రిడ్జిపై పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

● యువతి కారణమంటూ సూసైడ్ నోట్



రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 27: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి(28) కరీంనగర్ శివారులోని కేబుల్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ఒక యువతి కారణమంటూ మృతుడి వద్ద ఒక సూసైడ్‌నోట్ లభించిందని ఒకటో ఠాణా ఎస్ఐ స్వామి తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి కరీంనగర్ మంకమ్మతోటలో ఒక అద్దె గదిలో నివాసం ఉంటూ తెలంగాణ చౌక్ సమీపం లోని ఒక మెస్ అండ్ రెస్టారెంట్‌లో 6 సంవత్సరాలుగా క్యాషియర్‌గా పనిచేస్తు న్నాడు. అతడికి ఏడాదిన్నర కిందట ఒక యువతి పరిచయం అయింది. ఇద్దరూ తరచుగా కలిసేవారు. ఇటీవల రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అతడికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతి తననే వివాహం చేసుకోవాలని, లేకుంటే ఇద్దరు కలిసిన ఫొటోలు, మాటల వాయిస్ రికార్డులు బయట పెడతానంటూ రాజశేఖర్‌రెడ్డిని బ్లాక్‌మెయిల్ చేస్తూ కొన్ని డబ్బులు కూడా తీసుకుంది. ఈ నెల 23న ఆ యువతితో పాటు మరికొందరు రాజశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి గ్రామపంచాయతీ వద్ద గొడవ చేయగా గ్రామస్థులు సర్ది చెప్పి పంపించారు. రాజశేఖర్‌రెడ్డి తన కుటుంబ పరువు పోతుందని మనస్థాపంతో మంగళవారం ఉదయం కేబుల్‌బ్రిడ్జిపై పురుగుల మందుతాగి తన స్నేహితుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి మరణించాడని తెలిపారు. తన కొడుదు రాజశేఖర్‌రెడ్డి ఆత్మహ త్యకు యువతి, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులే కారణమంటూ మృతుడి తండ్రి దూది రఘుపతిరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతితో పాటు ఆమె కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు.

ఎస్‌యూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్



ఎస్‌యూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

గణేశ్‌నగర్, మార్చి27: శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు అపూర్వ స్పందన వచ్చినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ మనోహర్ తెలియజేశారు. ఆక్సిస్ బ్యాంక్, యాక్సెంచర్, పతంజలి సంస్థలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయని తెలిపారు. దీనికి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో యాక్సిస్ బ్యాంక్‌కు పదిమంది, యాక్సెంచర్‌కు ఆరుగురు, పతంజలిలో 13మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 31 మంది ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ ఈ మనోహర్ తెలియజేశారు.

అదృశ్యమైన విద్యార్థి మృతి

● 27రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు



అభిలాష్(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి27: స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఈ నెల 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27రోజుల తరువాత ఓ వ్యవసాయ బావిలో అతని మృతదేశం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యులు, సీఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, దామరకుంట గ్రామానికి చెందిన ఎనగంటి శ్రీనివాస్ రజిత దంపతులకు ఇద్దరు కుమా రులు. పెద్ద కుమారుడు ఎనగంటి అభిలాష్ (26) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉండి డిప్లొమా చదువుతున్నాడు. మార్చి ఒకటో తేదీన కళాశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అభిలాష్ తిరిగి కళాశాలకు చేరుకోలేదు. ఈ విషయం అతని తండ్రికి కళాశాల వార్డెన్ సమాచారం అందించారు. దీంతో తల్లిదండ్రులు స్థానికంగా ఎల్ఎండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఓ వివాహితను కాపాడే ప్రయత్నంలో విద్యార్థి మృతదేహం గుర్తింపు

అలుగునూర్‌కి చెందిన ఓ వివాహిత ఇంట్లో వేధిస్తున్నారని తాను బావిలో పడి చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు 100నెంబరుకు సమాచారం అందించారు. ఎల్ఎండీ పోలీసుల సహకారంతో తిమ్మాపూర్ స్టేజీకి సమీపంలో వ్యవసాయ బావుల వద్ద వివాహిత కోసం వెతికారు. ఆ సమయంలో ఓ వ్యవసాయ బావిలో విద్యార్థి అభిలాష్ మృతదేహంను గుర్తించారు. సంఘటన స్థలానికి తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి అభిలాష్ మృతదేహంగా నిర్ధారించారు. అతని తండ్రికి సమాచారం అందించి పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని అభిలాష్ తండ్రి శ్రీనివాస్‌కు అప్పగించారు. తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందని అభిలాష్ తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో వైపు మహిళను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న హరీష్‌రావు

● ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు ఎండిపోకుండా చర్యలు చేపడుతుంటే రైతులు ఆందోళన చెందేలా మాజీ మంత్రి హరీష్‌రావు వాస్తవాలను వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం ఎమ్మెల్సీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రబీ పంటల సాగు నీటి సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విస్మయం కలిగిస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రబీ పంటకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించకుండా ఎస్సారెస్పీలో ఉన్న నీటిని తరలించడంతో సాగు నీటి సమస్య తలెత్తిందన్నారు. 2023 సంవత్సరం జనవరితో పోల్చితే 2024 జనవరిలో 10 నుంచి 20 మిలియన్ల విద్యుత్ అధికంగా వినియోగం పెరిగిందనే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు తెలుసుకుని విద్యుత్‌పై మాట్లాడాలని హితవు పలికారు. గత ప్రభుత్వం దీర్ఘకాలిక రుణాల అప్పులపై వడ్డీ రాయితీ పూర్తిగా ఎత్తి వేపిందని, పంటల బీమా పథకానికి నిధులు చెల్లించలేక పథకాన్నే ఎత్తివేశారని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడైనా పంట నష్టపరిహారం చెల్లించారా అని హరీష్‌రావును ప్రశ్నించారు. పంట రుణాలకు సంబంధించి రైతులపై ఎటువంటి చర్యలు చేపట్టవద్దని, ప్రభుత్వమే రుణాలు చెల్లించేలా బాధ్యత వహించేలా బ్యాంకర్లతో పాటు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతుందన్నారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని పంట ఎంత నష్టపోతే అంత పరిహారం ఇస్తామని ఈ విషయంలో సీఎం ఇదివరకే జిల్లా కలెక్టర్లుకు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్‌కు చక్కెర ఫ్యాక్టరీ ఎప్పుడు ప్రారంభించారో, ఎవరి హయాంలో మూత పడిందో, దీనిని ఎవరు కొనుగోలు చేశారో అనే విషయాలు తెలువకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జగిత్యాల ప్రాంతానికి కవిత ఎంపీగా ఉన్న సమయంలోనే చక్కెర ఫ్యాక్టరీ పూర్తవగా మూతపడిన విషయం రైతులకు తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని మెనిఫెస్టోలో పెట్టామన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చేలా పునఃప్రారంభించే చర్యలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసిందని వివరించారు. చక్కెర ఫ్యాకరీని పుఃనప్రారంభం చేయించే బాధ్యత నాదేనని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు గుంటి జగదీశ్వర్, గాజుల రాజేందర్, చాంద్ పాష, శంకర్, అంజయ్య, మహేష్, మహిపాల్, వసంత్ రావు, రజనీకాంత్, విజయ్, మీర్‌ఖాజీం అలీ తదితరులు ఉన్నారు.



కొండగట్టులో హుండీ లెక్కిస్తున్న భక్తులు

అంజన్న హుండీ ఆదాయం రూ.1.11కోట్లు

మల్యాల, మార్చి 27: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. 48 రోజులకు ఈ హుండీల ద్వారా రూ.1,11,07,329 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 74 గ్రాముల మిశ్రమ బంగారం, 5.500కిలోల మిశ్రమ వెండి, 40 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ దేవాదాయ శాఖ డీసీ జి సంజీవరెడ్డి పరిశీలకులుగా పాల్గొనగా ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి తదితరులు ఈ లెక్కింపులో ఉన్నారు.

పొలాసలో వ్యవసాయ పరిశోధనలపై సమావేశాలు



హాజరైన అధికారులు, రైతులు

జగిత్యాలరూరల్, మార్చి 27: ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా సంఘ వానాకాలం- యాసంగి పంటలకు సంబంధించిన సమావేశాలు జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం ప్రారంభం అయ్యాయి. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు సుధారాణి, జ్యోతి ప్రజ్వలనచేసి సమా వేశాన్ని ప్రారం భించారు. పొలాస పరిశోధన కేంద్రంలో గత సంవత్సరంలో జరిగిన పరిశోధన ఫలితాలను డాక్టర్ శ్రీనివాస్ రైతులకు వివరించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజులత గత సంవత్సరంలో సలహా సంఘంలోని రైతుల సందే హాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తర తెలంగాణ జిల్లాల వ్యవ సాయ అధికారులు వారి జిల్లాలో ఉన్న పంటలు, ఆ పంటలలోని సమస్యలను, ఇబ్బందులను, ఫలితాలను ప్రజెంటేషన్ రూపంలో తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

1300 కేజీల పేలుడు పదార్థాల పట్టివేత

● ఇద్దరి అరెస్టు, వాహనం సీజ్



పేలుడు పదార్థాలను చూపిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 27: జిల్లాలో పేలుడు పదార్థాలను అక్రమ రవాణా చేస్తే ఊరుకోమని, అలాంటి వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మరిపెడ మండలం వీరారం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జగిత్యాల జిల్లా నుంచి మరిపెడకు వస్తున్న ఓ బొలెరో ట్రాలీ వాహనం పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారని, దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ వాహనంను తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట చెందిన కస్తూరి కుమార్, కస్తూరి సారయ్య, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంటకుంట తండాకు చెందిన దరావత్ కిశోర్ కలిసి బొలెరో ట్రాలీలో 50 ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్, 32 బాక్సులలో జిలెటిన్‌జిక్స్ పవర్ మొత్తం 6400, 20 బాక్సుల్లో జిలెటిన్ స్టిక్స్ పవర్ బూస్టర్‌లు 180, మొత్తం పేలుడు పదార్థాలు 1300 కేజీలను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన ట్రాలీ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కస్తూరి కుమార్ తండ్రి సారయ్య పేరుమీద వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ తెలంగాణ జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం జగదేవ్‌పేట పేరుపై లైసెన్స్ తీసుకుని లైసెన్స్ ప్రకారం కేవలం నిర్ణీత పరిధిలో మాత్రమే పేలుడు పదార్థాలను అమ్ముకోవాల్సి ఉందన్నారు. కానీ, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతోనే అక్రమంగా పేలుడు పదార్థాలను అనుమతి లేనివారికి విక్రయిస్తూ పట్టుబడ్డారని, ఈ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ప్రస్తుతం కస్తూరి సారయ్య పరారీలో ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని తెలిపారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య నేతృత్వంలో ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన మరిపెడ సీఐ హత్తిరాం, ఎస్సై తహేర్‌బాబా, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి27: జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులకు మూడు నెలల ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ సెక్రటరీ ఆఫ్ టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్ కరీంనగర్ పీ.నతానియేలు హానరరీ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ అభ్యర్థులు నేటి నుండి రేపటి లోపు అంబేడ్కర్ భవనం టీఎస్ స్టడీ సర్కిల్‌లో సర్టిఫికెట్స్ ఒరిజినల్స్ రెండు సెట్స్, జిరాక్స్ తీసుకొని వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ నందు ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో కళాశాల సిబ్బంది

గణేశ్‌నగర్, మార్చి 27: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జి సెంటర్ టీఎస్‌కెసి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఈ జాబ్ మేళా మంచి సువర్ణ అవకాశాన్ని కలిగించిందన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు ఏర్పాటు చేయడం వల్ల యువతలో ఏదైనా సాధించాలనే పట్టుదల పెరుగుతుందని తెలిపారు. కళాశాల టీఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ శోభరాణి మాట్లాడుతూ జాబ్ మేళాలో త్రెడ్స్, ఐటీ, హెచ్ ఐహెచ్‌ఆర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్, బ్యాంకు జోన్, మేడ్ ప్లస్, మెడికల్ ల్యాంక్, అపెక్స్ సొల్యూషన్స్, కాలిబర్ సొల్యూషన్స్, ఏకే సొల్యూషన్స్ నవత ట్రాన్స్‌పోర్టు, రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్, నెక్స మోటార్స్, బీవిఆర్ సొల్యూషన్స్ శాశ్వత డెవలపర్స్, ఆనంద నిలయం డెవలపర్స్, సౌర్య బిజినెస్ సొల్యూషన్స్, పిన్ ఎక్స్పోర్ట్, యాక్సిస్ బ్యాంక్, వరుణ్ మోటార్స్ తదితర 22కు పైగా కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. ఇందులో 358 మంది అభ్యర్థులు పాల్గొన్నారని, వారికి వివిధ దశలలో స్క్రీనింగ్ చేసి వారిలో 121 మందికి స్పాట్‌లో ఆఫర్ లెటర్స్ ఇచ్చారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న చినజీయర్‌స్వామి

కరీంనగర్‌రూరల్, మార్చి26: కొత్తపల్లిలో శ్రీభూనీళా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. నూతన ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి చేతుల మీదుగా మహాపూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం నిర్వహించారు. వేద పండితులు వరప్రసాదచార్యులు, పవన్‌కుమారాచార్యులు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నరహరి నారాయణరెడ్డి, రాజభాస్కర్‌రెడ్డి, నరహరి జగ్గారెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, తుమ్మల రమేష్‌రెడ్డి, బోగ సుదర్శన్ పాల్గొన్నారు.

రేకుర్తి కంటి ఆసుపత్రిలో లెజియన్ మెషిన్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, మార్చి 27: నగరంలోని రేకుర్తి కంటి ఆసుపత్రిలో బుధవారం త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి లెజియన్ మెషిన్‌ను ప్రారంభించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 37 లక్షల రూపాయల విలువైన లెజియన్ ఫాకో మెషిన్‌తో అతి చిన్న గాటుతో కేటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించనున్నారు. ఫాకో మెషిన్‌ను ప్రారంభించిన అనంతరం ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణ, శుభ్రత పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ కొండా వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, కోశాధికారి బొమ్మపవన్, ట్రస్ట్ సభ్యులు మురళీధర్‌రావు, కోల అన్నారెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కోదండరాములు, మోర బద్రేశం, సుధాకర్‌రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్మతి కళాశాలలో ఇన్నోఫెస్ట్

● ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



ప్రదర్శనలను తిలకిస్తున్న జువ్వాడి సాగర్‌రావు, కామాక్షి ప్రసాద్

తిమ్మాపూర్, మార్చి27: స్థానిక జ్యోతిష్మతి అటానమస్ కళాశాలలో బుధవారం ఇన్నోఫెస్ట్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జగిత్యాల ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, కామాక్షి ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు టెక్నికల్, నాన్ టెక్నికల్ అంశాలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. బుధ, గురు, శుక్రవారం మూడు రోజుల పాటు ఇన్నోఫెస్ట్ జరుగుతుందని తెలిపారు. ఇందులో సుమారు 700మంది విద్యార్థులు పాల్గొనున్నారని తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు కాంపిటేషన్స్, కోడింగ్, పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, ట్రెజర్ హంట్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రదర్శనకు మొదటి బహుమతిగా 5వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 3వేలు, మూడవ బహుమతిగా 2వేల రూపాయల నగదు బహుమతి అందించనున్నట్లు జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ జువ్వాడి సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ అకడమిక్స్ వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ పి.సంపత్‌రావు, కోఆర్డినేటర్స్ ఆర్.జగదీషన్, మణికందన్, పూర్ణచందర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఎఫ్‌తో కార్మికులకు భద్రత



మాట్లాడుతున్న ఈపీఎఫ్ జిల్లా నోడల్ అధికారి వెంకటేశ్వర్లు

హుజూరాబాద్, మార్చి 27: ఏ ప్రైవేట్ కంపెనీలో పనిచేసినా కార్మికులకు పీఎఫ్‌తోనే భద్రత ఉంటుందని ఈపీఎఫ్ జిల్లా నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని నాగార్జున డెయిరీలో కార్మికులతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కంపెనీ యజమాని కార్మికులకు పీఎఫ్ చెల్లించడం వల్ల ఉద్యోగి కుటుంబానికి భద్రత ఉంటుందన్నారు. వరుసగా పదేళ్ల పీఎఫ్ చెల్లిస్తే ఆ కార్మికుడికి పెన్షన్ వస్తుందన్నారు. కార్మికుడికి ఏదైనా ప్రమాదం జరిగినా, మరణించినా రూ. 2లక్షల నుంచి రూ. 7లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో డెయిరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్‌రావు, డైరెక్టర్ పుల్లూరి గణేష్‌రావు, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆకునూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల సమస్యలను పరిష్కరించాలి'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, మార్చి 27: ధరణిలో లోపాల మూలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిష్కరించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కోరారు. ధరణి రికార్డుల్లో తమ పేరు లేకపోవడంతో నిరాశకు గురైన కొందరు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి తన వ్యవసాయ భూమి ధరణిలో కనిపించడం లేదని, తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగి వేసారి కార్యాలయం ఆవరణలోనే విషం తాగి చనిపోయాడని ఆరోపించారు. ధరణి సమస్యలపై తాను గతంలోనే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ధరణి మూలంగా ఏర్పడిన సమస్యలకు జిల్లా కలెక్టర్లు, తహసీల్దార్లదే బాధ్యత అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు బాధ్యత తీసుకొని ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్ట విరుద్ధంగా ప్రతిపక్షాల ఫోన్లను ట్యాపింగ్ చేసిన వారిని పట్టుకున్న ప్రభుత్వం, గతంలో రైతులను ఇబ్బంది పెట్టిన కలెక్టర్లు, రెవెన్యూ అధికారులను ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన కర్ణన్‌కు ధరణి సమస్యలకు సంబంధించిన ఫైలును అందచేస్తే వాటన్నింటిని రిజెక్ట్ కొట్టారని ఆరోపించారు. ధరణిని అడ్డుపెట్టుకొని విచ్చలవిడిగా దోపిడీ చేశారని ఆయన విమర్శించారు. ప్రజలు రెవెన్యూ అధికారులపై తిరుగుబాటు చేసే రోజులు రానున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమా వేశంలో బోయినిపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, గజ్జల రవి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు చర్యలు

కరీంనగర్ టౌన్, మార్చి 27: నగరంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా నీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి.శ్రీనివాస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎల్ఎండీ ఇన్‌టెక్ నుంచి నగరానికి తాగునీరు సరఫరా చేసే పైపులైను వ్యవస్థను పరిశీలించారు. డ్యాం నుంచి రా వాటర్ తీసుకోవడంలో తలెత్తుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించి నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా రంగస్థల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, మార్చి 27: నగరంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి సీనియర్ కళాకారులను సన్మానించారు. తెలంగాణ రంగస్థలం అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్, ప్రధాన కార్యదర్శి అలువేలి సమ్మిరెడ్డి, కోశాధికారి నల్గొండ రమేశ్, జిల్లా డైరక్టర్ మాడ రాజిరెడ్డి, సహకార్యదర్శి రాంచంద్రారెడ్డి, పరుశ రాములు, కాంతాల రాజిరెడ్డి, నల్గొండ తిరుపతిరెడ్డి, శంకర్, యాదగిరి, పిట్టల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కరీంనగర్ కల్చరల్, మార్చి 27: మెగా పవర్ గ్లోబల్ స్టార్ రాంచరణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా నగరంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం రాంచరణ్ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం బొమ్మకల్‌లోని శ్రీపంచముఖ హన్మాన్ ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం చేసి అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత వేల్పుల వెంకటేశ్, మెగా నరేశ్, కుమార్, రవి, ప్రదీప్, కపిల్ మహదేవ్, సంతోష్, ప్రణయ్, సంతోష్, సాగర్, మారుతి పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా దొడ్డె శ్రీనివాస్

జమ్మికుంట రూరల్, మార్చి 27: జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దొడ్డె శ్రీనివాస్‌ను బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు అత్యధికంగా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం, పార్లమెంట్ ఇంచార్జ్ అంకని భానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

చొప్పదండి, మార్చి 27: చొప్పదండి పట్టణంలోని సాయిబాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా నగర సంకీర్తన, పల్లకీ సేవ, గణపతి హోమం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. అనంతరం సామూహిక అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి, దండి లింగన్న, డోలి రాజయ్య, దూస రాము, కటకం మహేశ్, తాటిపల్లి అంజయ్య, వెంకటాద్రి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న వాహనాల పార్కింగ్ సమస్య

-కరీంనగర్ మార్కెట్ ప్రాంతంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాల గుర్తింపు



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు, మున్సిపల్ అధికారులు

కరీంనగర్ క్రైం, మార్చి 27: నగరంలో చాలా కాలంగా ఉన్న పార్కింగ్ సమస్య నియంత్రణకు కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కూరగాయల మార్కెట్, రాజీవ్‌చౌక్, టవర్ సర్కిల్‌కు వచ్చే వాహనదారులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ బిల్డింగ్ ప్రాంతం(కలెక్టర్ క్యాంపు ఆఫీస్ ఎదురుగా), పాత మున్సిపల్ బిల్డింగ్ ప్రాంతాలను పార్కింగ్ స్థలాలుగా గుర్తించారు. ఇక నుంచి మార్కెట్‌కు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయకుండా ఈ రెండు చోట్ల పార్క్ చేయాలని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ కోరారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి పొట్టి శ్రీరాములు విగ్రహం మీదుగా మాంగళ్య షాపింగ్ మాల్ వరకు వున్న రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులకు సహక రించాలని కోరారు. పోలీసు, మున్సిపల్ శాఖ లకు చెందిన అధికారులు బుధవారం పార్కింగ్ స్థలా లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ స్వామి పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల చేయాలని వినతి

జమ్మికుంట, మార్చి 27: సాగునీరు విడుదల చేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు జమ్మికుంటలో రైతు సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. జమ్మికుంటకు వొడితల ప్రణవ్ వస్తున్నారని సమాచారం అందుకున్న రైతు సంఘం నాయకులు గాంధీ చౌరస్తాలో ఆయనను కలిసి మాట్లాడారు. నియోజక వర్గంలో పంటలు ఎండుతున్నాయని, సాగు నీరు విడుదల చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

'బ్లడ్ క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్స'



మాట్లాడుతున్న యశోద ఆసుపత్రి డాక్టర్ గణేశ్‌జైషెట్వార్

సుభాష్‌నగర్, మార్చి 27: బ్లడ్‌క్యాన్సర్ వస్తే భయపడాల్సిన పనిలేదని, యశోద ఆసుపత్రి హైటెక్ బ్రాంచిలో అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని ఆసుపత్రి హెమటాల జిస్టు, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్టు డాక్టర్ గణేశ్‌జైషెట్వార్ తెలిపారు. బుధవారం నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటెషన్‌పై విలేకరులతో మాట్లాడారు. బ్లడ్‌క్యాన్సర్ అనేది ఎవరికైనా రావచ్చన్నారు. జిల్లాకు చెందిన మురళి అనే వ్యాపారి బ్లడ్ క్యాన్సర్‌తో తమ వద్దకు వచ్చాడన్నారు. అతడికి అన్ని పరీక్షలు నిర్వహించి అతని సోదరి నుంచి స్టెమ్‌సెల్స్‌ను సేకరించి చికిత్స అందించామని తెలిపారు. అలాగే 13 సంవత్సరాలు బాలికకు కూడా ఆమె తల్లి నుంచి స్టెమ్ సెల్స్ సేకరించి చికిత్స అందించామని ప్రస్తుతం వారిద్దరు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

పన్ను వసూళ్లలో జమ్మికుంటకు ఐదో ర్యాంకు

● ఇప్పటికీ 90శాతం పూర్తి : కమిషనర్ ఎండీ ఆయాజ్



జమ్మికుంటలో పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

జమ్మికుంట, మార్చి 27: జమ్మికుంట మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో రీజనల్ పరిధిలో ఐదవ ర్యాంకులో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కమిషనర్ ఆయాజ్, ఆర్ఐ భాస్కర్‌లు బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ రీజనల్ పరిధిలో కరీంనగర్, అదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలు ఉన్నాయని, వీటిలో జమ్మికుంట ఐదవ స్థానంలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్ల సహకారంతో పన్నుల వసూళ్ల 90శాతం పూర్తి చేయగలిగామన్నారు. మున్సిపల్ పరిధిలో మూడు రూ.3కోట్ల 10లక్షల 49వేల పన్నుల బకాయిలు ఉన్నాయని, వీటిలో రూ.2కోట్ల79లక్షల 44వేలు వసూలు అయ్యాయని, మిగిలిన రూ.31లక్షల 5వేల రూపాయాలు వసూలు కావాల్సి ఉన్నాయన్నారు. ప్రాపర్టీ టాక్స్, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లు బకాయిలు ఉన్న వారు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ నెల 31లోపు బకాయిలు చెల్లిస్తే వడ్డీపై 90శాతం మాఫీ ఉందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

శంకరపట్నం, మార్చి 27: మహిళలు స్వశక్తితో సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని జెండర్ స్పెషలిస్టు శైలజ అన్నారు. బుధవారం శంకరపట్నం మండలం కరీంపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో పని ప్రదేశంలోని మహిళలకు, పురుషులకు స్త్రీ సాధికారత గురించి ఆమె అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. మహిళల సంపూర్ణ సర్వతోముఖాభివృద్ధికి భారత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. బాలబాలికలకు విద్య ప్రాముఖ్యతను తెలపాలన్నారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన పథకాలను 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. సుకన్య సమృద్ధి యోజన, సఖి సెంటర్ల గురించి అన్నిరకాల అత్యవసర సేవల ఫోన్ నంబర్లను, వాటి ప్రాధాన్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ముద్దమల్ల ప్రదీప్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

తిమ్మాపూర్, మార్చి27: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో బుధవారం డిటిసి పురుషోత్తం చలివేంద్రాన్ని ప్రారంభించి కార్యాలయానికి వచ్చిన వారికి తాగు నీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ కార్యాలయానికి పనుల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారుల, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ అభిలాష్, ఏఎంవిఐ స్రవంతి, సిబ్బంది ఉన్నారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 27: అదనపు వరకట్నం కోసం తన భర్త వేధింపులకు గురి చేస్తున్నాడంటూ ఓ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ వరంగంటి రవి బుధవారం తెలిపారు. జమ్మికుంటకు చెందిన వొల్లాల జ్యోతి గత ఐదు సంవత్సరాల క్రితం భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన వొల్లాల మహేందర్‌గౌడ్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో మూడు లక్షల కట్నం, మూడు తులాల భంగారం, ఇతర కట్న, కానుకలు ఇచ్చి ఘణంగా వివాహం జరిపించారు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. గత నెల రోజుల నుంచి మద్యం తాగి వచ్చి అదనపు వరకట్నం తేవాలంటూ తన భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సహకార సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వెన్నేంపల్లి సొసైటీలో మాట్లాడుతున్న చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి

సైదాపూర్, మార్చి 27: సహకార సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెన్నేంపల్లి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం సహకార సంఘం 63వ వార్షిక మహాసభ సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అధ్యక్షతన వెన్నేంపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘ పరిధిలోని రైతులకు స్వల్పకాలిక రుణాలు 362మంది రైతులకు రూ.4కోట్లు మంజూరు చేశామన్నారు. దీర్ఘకాలిక రుణాలను 5మంది రైతులకు రూ.25లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం కార్యదర్శి శ్రీధర్ వార్షిక నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షు డు కలకోటి కిషన్‌రావు, డైరెక్టర్లు మునిపాల రవి, బొమ్మగాని రాజు, నమిండ్ల జమున, పల్లెని ప్రవీణ్‌రావు, ఏలూరు తిరుపతిరెడ్డి, చాడ ప్రకాష్‌రెడ్డి, ఓలాద్రి మహిపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శంకరపట్నం: రైతుల అభివృద్ధే ప్రాథమిక సహకార సంఘ ప్రధాన ధ్యేయమని చైర్మన్ కేతిరి మధుకర్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకరపట్నం మండలంలోని తాడికల్ ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ కేతిరి మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తాడికల్ సొసైటీ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి వీరస్వామి గత సంవత్సర ఆదాయ వ్యవయాలను చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పరిధిలో గల రైతులకు పాత వాహనాల కొనుగోలుకు, కొత్త వాహనాల కొనుగోలుకు సులువుగా రుణాలను అందించినట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు నరహరి వెంకటరమణారెడ్డి, చీమిరాల శేషాచారి, దొంగల రాము లు, కలకుంట్ల సత్యనారాయణావు, పొలాడి హనుమంతురావు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

జమ్మికుంట రూరల్, మార్చి 27: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మడిపల్లి, రామన్నపల్లి గ్రామాల్లో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతవరణంలో ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల్లో అభద్రత భావాన్ని తొలగించడమే తమ ఉద్దేశ్యం అన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు.

ఆలయ చైర్మన్‌గా లక్ష్మయ్య

కరీంనగర్ కల్చరల్, మార్చి27: నగరంలోని సాయినగర్ శ్రీవిజయ గణపతి సాయిబాబా దేవాలయం చైర్మన్‌గా అయిందాల లక్ష్మయ్య ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం ఆలయంలోని ఈవో ఎండపల్లి మారుతి లక్ష్మయ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చిట్టుమల్ల కొండయ్య, నలువాల ప్రకాశ్, సిబ్బంది పిట్టల అంజయ్య గుడికాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

సుభాష్‌నగర్, మార్చి 27: గ్లోబల్‌స్టార్ రామచరణ్ జన్మదినం సందర్భంగా నగరానికి చెందిన ఆయన అభిమాని గాలిపెల్లి కుమార్ 59వ సారి రక్తదానం చేశారు. జిల్లా ఆసుపత్రిలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సుజాత అనే మహిళ ప్రసవం కోసం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. ఆమకు అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం ఎక్కించాలని డాక్టర్లు కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంటనే సామాకి కార్యకర్త గాలిపెల్లి కుమార్ సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయనను పలువురు అభినందించారు.

జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారికి అదనపు బాధ్యతలు

సుభాష్‌నగర్, మార్చి 27: జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కృష్ణప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణప్రసాద్‌కు చొప్పదండి ఏరియా ఆసుపత్రి డ్రాయింగ్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

నేత్ర దానం

సుభాష్‌నగర్, మార్చి 27: నగరానికి చెందిన మహాదేవా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. పెద్దపల్లి జిల్లా రొంపికుంటకు చెందిన తాళ్ళ శివకుమార్ ప్రమాదంలో మరణించాడు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు అయన నేత్రాలను జిల్లా ఆసుపత్రిలో రామమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ వారికి దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు అవారి రాజ్‌కుమార్, మామిడాల సుమంత్, తడిగోప్పుల అజయ్, వడ్లకొండ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

భగత్‌నగర్,మార్చి 27: ఆర్టీసీ కరీంనగర్ టు డిపోలో ప్రతిభ చాటిన ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులను బుధవారం డిపో మేనేజర్ మల్లయ్య ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభచాటిన ఉద్యోగులు కె వినోదబాయ్, పి రమేష్, జె చంద్రయ్య డిఎంరెడ్డి, ఎం లచ్చయ్య వి రాజన్నలను సన్మానించారు. ఈ సందర్భంగా పి విజయలక్ష్మీ, కె తిరుపతి మజ్జిగ వితరణ చేశారు.

ఇఫ్తార్ సామగ్రి పంపిణీ

కరీంనగర్ రూరల్, మార్చి 278: మజ్లిస్ తహఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని రేకుర్తి మదర్సాలో బుధవారం ఇఫ్తార్ సామగ్రిని పంపిణీ చేశారు. ట్రస్టు జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 30 గ్రామాల్లోని ముస్లింలకు ఇఫ్తార్ సామగ్రిని అందించారు. ఈకార్యక్రమంలో హాఫీజ్ షేఖ్, అహ్మద్ హిప్పి, ముఫ్తి ఇంతియాజ్, అబ్దుల్ రాఫే, మహమ్మద్ రఫీ, హాఫీజ్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయవద్దు

హుజూరాబాద్, మార్చి 27: వేసవిలో నీటిని వృథా చేయకూడదని సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్ బుధవారం తెలిపారు. చాలా మంది ఇంటి యజమానులు నల్లా నీటిని వృథా చేస్తున్నారని ఇది సరికాదన్నారు. తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్రలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రామడుగు, మార్చి 27 : మండలంలోని గోపాల్‌రావుపేటలో జరుగుతున్న వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కల్యాణం వైభవంగా జరిగింది. ఈ కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

వీణవంక,మార్చి27: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం చల్లూరు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రజక సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. మడేలయ్య ఆలయంలో పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మూల రజిత పూల్లారెడ్డి,నాయకులు చింతల శ్యాసుందర్ రెడ్డి, నల్ల కొండల్‌రెడ్డి,సాహెబ్ హుస్సేన్, తాళ్లపల్లి తిరుమలేష్,కనకం వెంకట స్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపుకోసం పనిచేయాలి

● మాజీ ఎంపీ వినోద్‌కుమార్

వీణవంక, మార్చి27: కార్యకర్తలు బీఆర్ఎస్ గెలుపుకోసం పనిచేయాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వీణవంక మండల కేంద్రంలోని వివాహవేడుకకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రంలోని టీ పాయింట్ వద్ద టీ తాగుతూ కార్యకర్తలతో ముచ్చటించారు. పక్కనే ఉన్న మోటర్ వైండింగ్ షాపులో యాజమానితో మాట్లాడుతూ రోజుకు ఎన్ని మోటర్లు వస్తున్నాయని అడుగగా రోజుకు రెండు వస్తున్నాయని బదులు ఇచ్చారు. మోటరు చేపిస్తే ఎంత ఖర్చు వస్తుందని అడిగారు. ఒక్కో మోటర్‌కు రూ.3,500 ఖర్చు వస్తుందని షాపు యజమాని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు మోటార్లు రాలేదని చెప్పారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. మండలంలో బీఆర్ఎస్ పరిస్థితిపై ఆరాతీశారు. వీరి వెంట మండల నాయకులు ముసిపట్ల తిరుపతిరెడ్డి, గెల్లు శ్రీనివాస్, మర్రి స్వామి,మోరె స్వామి, భానుచందర్,సంజీవరెడ్డి, కుమార్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేవాలయ హుండీ లెక్కింపు

మానకొండూర్, మార్చి 27 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ హుండీ లెక్కింపు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపులో లక్షా 81,666 రూపాయలు వచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.